## చిన్నకథ

# మౌనవీణ

కాంపునుంచి ఉదయం తిరిగి వచ్చి కాలింగ్ బెల్ కొట్టిన మరుక్షణం మా ఆవిడ తలుపు తీసింది. నా చేతిలోని పెట్టె తీసుకుని వెనుతిరిగింది. ఈవిడకు తల్లిదండ్రులు రాధ అని పేరెందుకు పెట్టారో. రుక్మిణి అని పెడితే బాగుండేది. తులసిపూజలు చేస్తూ సుఖంగా ఉండేది. సోఫాలో కూచోగానే కాఫీ కప్పులు పట్టుకొచ్చింది. ఇద్దరం మౌనంగా కాఫీ తాగాం.

“స్నానం చేసి రండి. టిఫిను రెడీ చేస్తాను” అంటూ లోపలకు వెళ్లబోయింది.

“నీ కోసం ఏం తెచ్చానో చూడు” అంటూ బ్రీఫ్ కేస్‌లోంచి పాకెట్ తీసి ఇచ్చాను. పాకెట్ విప్పి చూసుకుంది. ఎర్రటి బెనారస్ పట్టుచీర.

ఆమె కళ్లలో మెరుపు కనిపించిందా? నోటమాట లేదు.

స్నానం చేసి వచ్చేసరికి ఉప్మా, పెసరట్టు రెడీగా ఉన్నాయి. “నార్త్ ఇండియా టూర్ కదా. మన టిఫిను తిని చాలా రోజులై ఉంటుందని చేశాను”

నేను నిట్టూర్చాను.

***

ఆఫీసుకు వెళ్లి సీట్లో కూచోగానే నా సెక్రటరీ రుక్మిణి వచ్చింది. చక్కగా దువ్వి వదిలేసిన బాబ్‌డ్ హెయిర్, స్లీవ్ లెస్ బ్లౌజ్, నాభి కనిపించేలా చీరకట్టూ, పెదవులకి ఎర్రటి లిప్‌స్టిక్, అరమైలు నుంచీ తెలిసే పెర్‌ఫ్యూమ్. ఈవిడకు రుక్మిణి అన్న పేరేమిటో. మాటల సందర్భంలో అంత పాతకాలం పేరేమిటంటే “దానికేమంది సార్. మిన్నీ పిలవండి” అంది.

టేబుల్ మీద ఫైల్సు పెట్టి “సార్. నేను అడిగింది...” అంది.

నేను వెంటనే ఆమె తెచ్చి పెట్టమన్న రాధాకృష్ణుల బొమ్మ తీసి ఇచ్చాను.

“ఓహ్ లవ్లీ. చాలా బాగుంది సార్. థాంక్యూ వెరీమచ్. కృష్ణుణ్ణి చూస్తే ముద్దు పెట్టుకోవాలనుంది. ఎంత అందంగా వున్నాడో...” ఒక్క క్షణం ఆగి “అచ్చం మీలాగే” అంది.

నా ఒళ్లు ఝల్లుమంది. అప్రయత్నంగా కాలరు సర్దుకున్నాను.

“సార్ ఎంతయిందో చెప్తే..”

“నో నో..నా నుంచి గిఫ్ట్ అనుకోండి”

“ఓహ్.. థాంక్యూ. రేపు నా బర్త్‌డే. అడ్వాన్స్‌డ్ గిఫ్ట్.”

కొంగు జారిందో లేదో కానీ సర్దుకుని వెళ్లిపోయింది.

***

సాయంత్రం ఇంటికొచ్చేసరికి ఏడయింది. గుమ్మంలోనే ఎదురైంది రాధ. ఎర్ర బెనారస్ చీర కట్టుకుంది. తలలో కనకాంబరాలు పెట్టుకుంది. మెడని పట్టినట్లుగా ఎర్రటి పూసల దండ. చెవులకి పగడాల దుద్దులు. అసలే ఎర్రటి బుగ్గలు. మరింత ఎర్రగా వున్నాయి. ఆమెను గట్టిగా కౌగలించుకుని బుగ్గను ముద్దాడాను. మరింతగా బుగ్గలు ఎర్రబడ్డాయి. కారణం ఆమె సిగ్గా, నా తమకమా?

ఆమె నాకు మరింత దగ్గరౌతూ “రైల్వేలో తత్కాల్ రిజర్వేషన్‌లా టైలర్‌కి అందరివీ వెనక్కి పెట్టి నా జాకెట్టు కుట్టమని ఎక్కువ డబ్బిచ్చి కుట్టించుకున్నాను” అంది.

నేను “అనవసరంగా కుట్టించుకున్నావు” అన్నాను.

ఆమె ప్రశ్నార్థకంగా చూసింది.

“అనవసరమెందుకంటే ఇందుకు” అంటూ జాకెట్ హుక్స్‌మీద చెయ్యివేశాను. ఆమె ఏమీ మాట్లాడలేదు.

నెమ్మదిగా లోపలకి నడిపించుకుంటూ వెళ్లాను “ఎంత అందంగా వున్నావో తెలుసా? నీ బుగ్గలు గులాబీ మొగ్గలు” అంటూ ముద్దు పెట్టుకున్నాను. “నీ పెదవులు దొండపళ్లు” అంటూ అధరాలు చుంబించాను. “ఇవి లంకె బిందెలు,తామర మొగ్గలు” అంటూ ఆమె యవ్వనాన్ని ఆస్వాదించాను.

అరగంట గడిచింది. ఆమె అలసటగా పడుకుంది. నాలో ఒకవైపు ఆనందం, ఒకవైపు అసంతృప్తి. ఒక్కమాటైనా లేదేమిటి? ఇంత ముద్దురాచ్చిప్పా నాకు దొరికింది?

***

మర్నాడు రుక్మిణి “సార్, ఈరోజు సాయంత్రం



మా ఇంటికి రావాలి. నా బర్త్‌డే పార్టీ” అంది.

సాధారణంగా స్టాఫ్ ఇళ్లకి వెళ్లడం అలవాటు లేదు. కానీ రుక్మిణి అడిగిన తీరులో ఏముందో కానీ కాదనలేక పోయాను.

సాయంత్రం రుక్మిణి స్కూటర్ ముందూ, నా కారు వెనకగా ఆమె ఫ్లాట్‌కి చేరుకున్నాం. ఫ్లాట్ తాళం తీసి లోపలకు అడుగు పెడుతూనే “వెల్‌కమ్” అంది.

“ఇంట్లో ఎవరూ లేరా?” అన్నాను.

“నేనున్నానుగా” అంది. ఆమెతోపాటు ఆమె వక్షస్థలమూ నేనున్నానన్నట్లు ఎగిరిపడింది.

“కూచోండి. బట్టలుమార్చుకు వస్తాను” అంది.

పది నిమిషాలలో వచ్చింది. గులాబీరంగు నైటీ ఆమె గులాబీరంగు శరీరంలో కలిసి పోయింది. కానీ అంగాల ఒంపుసొంపులు అందంగా కనిపిస్తున్నాయి.

రెండు గ్లాసులలో డ్రింక్స్ తెచ్చి నా చేతిలో ఒకటి పెట్టి నా పక్కనే కూచుంది. ఆమె సర్వాంగాలూ నన్ను తాకుతున్నాయి.

“మీరు చాలా అందంగా ఉంటారు”

నాలో మగసిరి పొంగి పొర్లింది. సొగసరి నాకు మరింత దగ్గరైంది.

“ఇంకెంత ఆనందమిస్తారో”

నా చేతులు ఆమె అందాలపై కదలాడాయి. ఆమె అనుక్షణం ‘అబ్బ.. అయ్యో.. లవ్లీ’ అంటూ వుంది.

నాలో ఆనందం ఉప్పెనలా పొంగింది.

చేతులూ, అధరాలూ పని చేస్తూనే ఉన్నాయి. నెమ్మదిగా ఆమెలో నేను ఐక్యం కావాలనుకుంటూ ఉండగా “సార్” అంది.

ఒక్కక్షణం ఆగాను.

“సార్, పర్సనల్ ఆఫీసర్ పోస్టు ఖాళీ అయింది కదా. నా పేరుమీరు రికమెండ్ చేసి హెడ్ ఆఫీస్‌కి పంపితే..”అంటూ నాకు మరింత దగ్గరగా జరిగింది.

ఆకాశం మీదనుంచి అధఃపాతాళానికి పడినట్లనిపించింది.

తియ్యటి పెదవుల వెనక హృదయంలో వున్నది స్వార్థమా?

నేనింత దిగజారబోవడానికి కారణమేమిటి? రుక్మిణి మీద ప్రేమా, రాధ మీద కోపమా? రుక్మిణిని పక్కకు తోసినిలబడ్డాను

నిజమే. రాధ మాట్లాడదు. నేను చీరకొనుక్కొస్తే “అబ్బ ఎంత బాగుంది” అంటూ నన్ను పొగిడెయ్యదు. కానీ ఏ పెళ్లికో, పేరంటానికో దాచుకోకుండా ఆ నాటి కా నాడే చీర కట్టుకొని నన్ను అలరించాలనుకుంది. నా చెయ్యి తగిలినా, పెదవి ముద్దాడినా ‘అబ్బా...అయ్యో’ అనదు. కానీ నా స్పర్శకు ఆమె శరీరం వీణలా నినదిస్తుంది. తనను తాను నాకు పూర్తిగా అర్పించుకోవాలి. నానుంచి మాటలకి అతీతమైన ఆనందాన్ని పొందాలి. ఆ సమయంలో మాటలెందుకు, మెప్పుకోళ్లెందుకు. పొగిడి, పొగిడి ఏదో ఒకటి లాగేసే ప్రయత్నమెందుకు?

మధురమైన మౌనవీణ ముందు మాటలు శ్రుతి కుదరని భేరీధ్వనులు కావా.

***

ఇల్లు చేరేసరికి రాత్రి తొమ్మిదయింది.

గుమ్మంలోనే రాధ ఎదురైంది.

“ఆలస్యమైతే భయమేసి ఆఫీసుకి ఫోను చేశాను. వాచ్‌మాన్ మీరు వెళ్లి పోయారని చెప్పాడు. సెల్ ఫోను ఆఫ్‌లో ఉంది. ఏమైందో అనుకుని భయపడుతూ ఇక్కడే నిల్చున్నాను.” అంటూ నన్ను వాటేసుకుంది.

తెల్లని చీర, మల్లెపూలు, ముత్యాలదండ. ఆమె శరీర సౌంద్యానికి ముగ్ధురాలయ్యాను. అంతకన్నా తెల్లని ఆమె హృదయానికి దాసుణ్ణయ్యాను.

– పి.ఎస్.